# గోదారమ్మ-7

“నేను అలా చెప్పగానే రామచంద్ర వర్మ మొహం వాడిపోయింది...కానీ వెంటనే తమాయించుకుని ‘అమ్మా...సీత అంటే నాకెంతో గౌరవం. మగతోడు లేకుండా...ఒక్కతే ఈ సమాజంలో తన కొడుకును మంచి పౌరుడు గా తను తీర్చిదిద్దుతున్న తీరు కి నేనెప్పుడూ ఆమెని ఆరాధిస్తూంటా ! తన పాత అనుభవాల దృష్ట్యా ఆమెకి అందరి మగవాళ్ళంటే సదభిప్రాయం పోవటంలో తప్పేమీ లేకపోవచ్చు. అయితే దీనికి సీతగారికి దూరంగా ఉంటే... సరిపోతుందిగా... రంగాకి మాత్రం... దూరంగా ఉండటం కుదరదనిపిస్తోంది! చిన్నపిల్లలకి నేను బాగా దగ్గరైపోతాను పెద్దమ్మగారూ! చిన్న పిల్లలు ఎవర్ని చూసినా... వాళ్ళెవరి పిల్లలూ, వాళ్ళగురించి నాకెందుకూ అని అనిపించనే అనిపించదు! రంగా విషయమూ అంతే, కుముదను చూస్తే ఎంత ఆత్మీయత కలుగుతుందో, రంగాపట్లా అంతే! అయితే మీరు హెచ్చరించిన విషయం నా మనసులో వుంచుకుని సీతకు మాత్రం ఇంక దూరంగా ఉంటా’ అన్నాడు. నిజానికి అలా చెప్పటమే కాదు, ఆ అబ్బాయి అలాగే చేసి చూపిస్తున్నాడు కూడా ...! వాళ్ళు వచ్చినపుడు కుముద నీ దగ్గిర కూర్చుని ఏవో తనకు వచ్చిన పాటలు పాడి వినిపించటం, నీ దగ్గిర ఒకటి రెండు నేర్చుకునే ప్రయత్నమూ చేస్తుంటే... ఆ సమయంలో రామచంద్ర మాత్రం రంగాని దగ్గర కూర్చోబెట్టుకుని... పుస్తకాలన్నీ చూస్తూ, ఏవేవో అడుగుతూ రంగా చదువుపట్ల ఆసక్తి చూపిస్తూంటాడు! అతని ఆలన పాలనలో రంగా ఎదుగుదల బావుంటుందనిపిస్తుంది! అందుకే ముందు నిన్ను సంప్రదించానా...నీకంత సుముఖత లేదని తెలియగానే అతనితో ఆ విషయం అలా చెప్పాను సీతా ! ”

ఆ మాటలకు సీత వదనం వికసించింది. ఆ విషయం గోదారమ్మ గమనించింది.

‘‘అతనిది ఎంత మంచి మనసు కాకపోతే... అన్న కూతురిని స్వంత పిల్లలా చూసుకుంటాడూ.. అదీ తన సుఖం గురించీ, పెళ్ళి గురించీ కూడా ఆలోచించకుండా!’’ వెంటనే మళ్ళీ అందావిడ.

అవునన్నట్లుగా తల వూపింది సీత.

ఇద్దర్నీ దూరం పెడితేనే దగ్గరవుతారేమోననే తన అభిప్రాయం ఫలిస్తుందా...? ఆవిడ ఆలోచనలో పడింది.

* * *

‘‘మాటే మంత్రము...మనసే బంధమూ..

ఈ మమతే, ఈ సమతే..మంగళ వాద్యమూ..

ఇది కళ్యాణం, కమనీయం..జీవితం.

ఓ..ఓ..ఓ..మాటే మంత్రమూ.....'' పాట రాగం తీస్తూ సీత వంటపనిలో ఉంటే, ఇంటిముందున్న మెట్లమీద కూర్చుని గోదారమ్మ మైమరపుతో వింటోంది.

ఆ వీధిన వెళ్తున్న పద్మావతమ్మ ఆగి, ఆవిడ కూర్చున్న వరండా మెట్లమీదే పక్కన కూర్చుంటూ, ''ఏమిటీ... తీరుబడిగా ఉన్నారూ... పనంతా అయిపోనట్లేనా...?'' అనడిగింది.

గోదారమ్మ చిరునవ్వుతో పలకరింపుగా చూసి ''నాకంటూ చేయటానికి పనులేమి ఉంటాయమ్మా...! స్కూలు నుండి సీత వచ్చేసిందిగా, ఇక నన్నేమీ చేయనివ్వదు... ఏదో వంట పని చేస్తూ పాట పాడుతుంటేనూ... వింటూ కూర్చున్నా...!'' అని జవాబు చెప్పింది.

''మీరు... సీత మాట తీసుకువస్తేనూ, నాకు గుర్తుకువచ్చింది... మొన్న కాబోలు సంతరోజున చూసాను.. ఆ రామచంద్ర వర్మతో ఏం విరగబాటుతో కబుర్లు చెబుతోందనుకున్నారూ... పెద్దవాళ్ళు మీరు ఇంట్లో ఉండగానే, ఇద్దరి మధ్యా ఏదో వ్యవహారం నడుస్తున్నట్లే ఉంది సుమండీ...!'' రహస్యం చెబుతున్నట్లుగా గొంతు తగ్గించి ఆవిడవైపుకి ఒంగి అంది పద్మావతి.

గోదారమ్మా చిరునవ్వుతో చూస్తూ ''నిజమేనా మీరు చెప్పిందీ... ఎంత మంచిమాట చెప్పారూ...!'' అంది.

పద్మావతి విస్తుపోయి విచిత్రంగా చూసింది. తను చెప్పింది సరిగా అర్థం కాలేదేమోనని అనుకుంది కూడా!

కానీ.... గోదావరమ్మ మళ్ళీ అన్న మాటలు వినగానే ఆమెకు మతిపోయినంత పనయింది.

''ఇద్దరూ ఒకే వయసువాళ్ళా... కానీ కేరింతలు కొట్టినట్లు కబుర్లూ... నవ్వులూ ఏవీ ఉండవు పద్మావతమ్మా...! ఇంత చోద్యం నేనెక్కడా చూడ్లేదు మరి! ఇదరికిద్దరూ ఏదో పెద్దమనిషి తరహాగా ఉంటారు. నాకేం నచ్చదు! చక్కగా ఇద్దరరి మధ్యా ప్రేమ ఏర్పడి... ఒక ఇంటివాళ్ళయితే ఎంత బావుంటుందీ అని నా ఆలోచన! అది నెరవేరదేమోనని నేను బెంగెట్టుకున్నా. కానీ... మీ మాటలతో నా ఆశ నెరవేరుతుందేమో ననే ఆలోచన కలుగుతోంది!''

గోదారమ్మ మొహం ఇం.... త చేసుకుని అన్న మాటలకు పద్మావతి తెల్ల మొహం వేసుకుని వెర్రిదానిలా చూసింది. తన పెద్దరికాన్ని అవమానిస్తున్నట్లుగా ఆవిడ వెనకే భాగోతం జరుపుతున్నారని చెబితే... కోపం కలుగుతుందని ఊహించింది... వాళ్ళిద్దరిమీదా ఆగ్రహంతో రగిలిపోతుందనుకుంటే... ఇదేమిటీ ఈవిడిలా విచిత్రంగా మాట్లాడుతోందీ...?

పద్మావతి ఉద్దేశ్యాన్ని గ్రహించినా అదేం గమనించనట్లుగా గోదావరమ్మ కూడా ఆవిడలాగే గొంతు తగ్గించి అంది. "వాళ్ళిద్దరూ అనుకుంటే... పెళ్ళి ఎంతసేపు... ఎవరూ అడ్డు చెప్పే వాళ్ళు లేరు... పైగా మనలాంటి వాళ్ళం సంతోషిస్తాం కూడా కదా! వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకుని... పిల్లలు ఇద్దర్నీ పెంచుకోవటం ఎంత బావుంటుందీ...? ఈ ఆలోచన నాకేగానీ వాళ్ళకేమాత్రం ఉన్నట్టు కనుపించదు.

మొన్నటికి మొన్న... మీరు చెప్పిన ఆ సంతరోజున... రామచంద్ర వెళ్తుంటే... 'నువ్వూ వెళ్ళి ఏవైనా కూరగాయలు మనకీ తీసుకురా' అని పంపానా... నాలుగడుగులు వేసి 'రాజవ్వ దగ్గర తీసుకుంటేనే సరిపోతుంది కదమ్మా...' అంటూ వెనక్కి వచ్చేసింది! ఇద్దరూ సరదాగా షికారుకి వెళ్ళినట్లుగా వెళ్ళి ఏవో నాలుగు రకాల కూరగాయలు తెస్తారనుకుంటే... ఈ సీత ఇలా చేసింది! నిజం చెప్పొద్దూ... నాకు ఒళ్ళు మండిపోయింది గానీ తమాయించుకుని చేసేదేంలేక వూరుకున్నాను!''

పద్మావతికి విషయం అర్థమైపోయింది. తను అబద్ధం చెబుతున్నట్లుగా ఈవిడ నిరూపించేసిందన్నమాట!

చేసేదేం లేక తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో ''నిజమేలెండి... మీరన్నట్లుగా సీత మళ్ళీ పెళ్ళికి సిద్ధమైనా కాదనేవాళ్ళెవరూ...!'' నిష్ఠూరంగా అంటూ లేచి నిలబడింది.

'మళ్ళీ ఏమిటీ' అనబోయిన గోదారమ్మ నిగ్రహించుకుంది. 'సీతకు ఇంతకు ముందు పెళ్ళి కానేలేదనే విషయం ఈ వూళ్ళో తనొక్కదానికేగా తెలుసూ' మనసులో అనుకుంటూ నిట్టూర్చి వూరుకుంది. పైగా ఎవరితోనూ ఆమాట చెప్పవద్దని సీత తనకి చెప్పిందికదా! అవును... ముఖ్యంగా రంగాకు తెలియకూడదు. వాడు సీతనే తన తల్లి అనుకుంటున్నాడు. కాదని తెలియటం సీతకే కాదు..తనకీ ఇష్టంలేదు.

ఈ ఊరులో ఎవరో ఒక్కరికి ఈ విషయం తెలిసినా చాలు... వూరంతటికీ నిమషాల్లో పాకిపోతుంది! అప్పుడు రంగాకు తెలిసిపోవటం ఎంతసేపూ... ఆ విషయాన్ని పనికట్టుకుని ఆ పసివాడికి తెలియచెప్పాలనే తహతహ చాలామందికే ఉంటుంది మరి!' గోదావరమ్మ నిట్టూరుస్తూ అనుకుంది.

పద్మావతి ఒక అడుగు వేయగానే ఆవిడకు ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా ''పద్మావతీ... ఒక క్షణం ఆగు...'' అంటూ లేచి నిలబడింది.

''నీ మాట మహిమ వల్ల సీతకి పెళ్ళి జరిగితే, చాలా బావుంటుంది. నువ్విప్పుడు 'పెళ్ళి జరిగితే కాదనేవాళ్ళెవరూ?' అన్నావుగా అది చాలా నిజం! అందరూ సంతోసించేవాళ్ళే తప్ప, తప్పు పట్టే వాళ్ళెవరూ లేరని ఎంత బాగా చెప్పావ్! నీ వాక్శుద్ధి వల్ల అలా జరిగితే, ఆనందమేగా? ఇంకో పనీ నీ వల్లే అవుతుందనిపించి... చెప్పాలనుకుంటున్నాను.

మీ ఇంటిపక్కనే ఉండే అమ్మాయి పేరేమిటి... ఆ.... జ్ఞాపకం వచ్చిందిలే... పూర్ణ కదూ... పాపం... ఆ అమ్మాయి తప్పేముంది చెప్పు.... ఆ పిల్ల అమాయకత్వం చూసి... అత్యాచారం చేసిన వాడిది కదా తప్పు... అయినా అదేమిటో శిక్ష ఆ అమ్మాయికి వేయటం  ఎంతవరకూ సమంజసం గా ఉందో నా కర్ధం కావటం లేదు...? వీధిలో వాళ్ళలానే, ఇంట్లో వాళ్ళు కూడా ఆ అమ్మాయిపట్ల సానుభూతి లేకుండా, దూరం పెట్టి దారుణంగా ప్రవర్తిస్తున్నారనిపిస్తోంది.

నువ్వూ గమనించేవుంటావు...  పిల్ల పూర్తిగా పిచ్చిదానిలా అయిపోయింది. మొన్న నేను గుళ్ళోకి వెళ్ళినపుడు... ప్రవచనాలు వినటానికి పెద్దవాళ్ళు వస్తోంటే, ఆ అమ్మాయి వచ్చింది కాబోలు... దూరంగా కూర్చోబెట్టారు.

ఈ వేళ మనిద్దరం గుడికి సాయంకాలం వెళ్దాం. ఆ అమ్మాయినీ రమ్మని చెప్పు.  విడిగా కాకుండా మన దగ్గిరే కూర్చోబెట్టుకుందాం.... ఎవరేం అంటారు... నీలాంటి దానివే ఆప్యాయత చూపిస్తున్నపుడు... నన్ను ధిక్కరించగల ధైర్యం ఈ వూళ్ళో వాళ్ళకి ఏం ఉంటుంది?

అంతే కాకుండా ఇంకో పని కూడా నువ్వే చేయగల సమర్థురాలివి! ఆ అమ్మాయి చదువూ అర్థాంతరంగా మానిపించేసారట, పెళ్ళి ప్రయత్నాలూ చేయకూడదని అనుకున్నారట. పెళ్ళికి తొందరేం లేదుగానీ... తన కాళ్ళమీద తాను నిలబడగలిగేలా ఏదో చిన్న ఉద్యోగంలో పెట్టి... ఆ పైన ప్రైవేటుగా చదువుకోగలిగే ప్రయత్నం చేయిస్తే బావుంటుంది కదూ...?''

గోదారమ్మ మాటలకు పద్మావతి నిర్ఘాంతపోయింది. గొంతు తడారిపోయింది కూడా.

''నేనేం చేయగలనండీ...?'' కీచుగొంతుతో మెల్లగా అడిగింది.

‘‘అదేమిటమ్మా అలా అంటావ్....? మీ ఆయన పనిచేసే ఫ్యాక్టరీలో ఏదైనా చిన్న ఉద్యోగం ఉంటే వేయించమని చెప్పు. మీ ఆయన పరపతి గురించీ, నీ మాటకు ఆయనిచ్చే విలువ గురించీ నాకు తెలియకనా ? బాగా తెలుసు...!’’ ఆ మాటలకు పద్మావతమ్మ మొహం వికసించింది.

తన గురించి ఆవిడ అలా మంచిగా మాట్లాడటం, పద్మావతికి చాలా సంతోషం కలిగించింది.

‘‘తప్పకుండా నా ప్రయత్నం నేను చేస్తాను... ఆ అమ్మాయి మా ఇంటి పక్కనే ఉంటుందిగా, చూస్తుంటే... నాకూ చాలా బాధగా ఉంటుంది. ఆలోచిస్తే... అతనెవరో చేసినదానికంటే వాళ్ళింట్లో వాళ్ళు ప్రవర్తించే విధానమే ఎక్కువ బాధాకరంగా నాకూ అనిపిస్తోంది!’’ అంది పద్మావతి.

గోదావరమ్మ ఆవిడ చేయిని పట్టుకుని మళ్ళీ అంది ‘‘చాలా చక్కని మాట చెప్పావమ్మా... నువ్వు ప్రయత్నం చేస్తే... కాకపోవటమంటూ ఉండదని నాకనిపిస్తోంది. నీ మాటలవల్లే నాకీ ఆలోచన ఇపుడే వచ్చింది సుమా....!’’

పద్మావతి కూడా సంతోషంగా అలాగే అన్నట్లుగా తలవూపి అడుగులు ముందుకు వేసింది.

లోపలనుండి వచ్చిన సీత వరండా మెట్ల మీదనుండి వసారాలోకి వస్తున్న గోదారమ్మను ‘‘ఏమిటమ్మా... ఆ పద్మావతమ్మతో మాట్లాడుతున్నారూ...?’’ అనడిగింది.

‘‘మన పెద్దవాళ్ళు ‘మాటే మంత్రమూ’ అన్నారుగా...సరిగ్గా ఇందాక అదే నువ్వూ పాడుతున్నావ్. అయితే అదెలా  పనిచేస్తుందో చూద్దామని ఆవిడ మీద చిన్న ప్రయోగం చేసా. పనిచేసినట్లేనని నాకు అనిపించిందిగానీ ఫలితం ఎలా ఉంటుందో చూడాలి...!’’ అంది ఆవిడ నిట్టూరుస్తూ.

‘‘అంటే...? నాకు సరిగా అర్థంకాలేదు. కొంచెం వివరంగా చెప్పండమ్మా’’ అడిగింది సీత.

‘‘అబ్బ... ఏదో లేవే... వాళ్ళింటి పక్కన ఉండే పూర్ణ గురించి చిన్నపని అప్పచెప్పాను. అది జరుగుతుందో లేదో! కొన్నాళ్ళు పోయాక... ఆ వివరం నీకూ తెలుస్తుందిలే! అది సరేగానీ, నువ్వు ఇందాక పాడుతున్న పాట నేను పూర్తిగా వినలేదు... ఆ పద్మావతమ్మతో మాటల్లోపడి. మళ్ళీ ఒకసారి చక్కగా పాడు... వింటాను. నీ పాట వింటోంటే కలిగే మైమరపు, పారవశ్యం మామూలుగా ఉండదనుకో...! అసలు నువ్వు సంగీతం కూడా నేర్చుకుంటే ఇంకెంత బాగుండేది సీతా...’’

ఆవిడ మాటలకు తన్మయత్వం చెందుతూనే సీత నిట్టూర్చింది... ''ఏదో అలా పాడుకోవటమే కానీ సంగీతం నేర్చుకోవాలని ఎప్పుడూ అనుకోలేదమ్మా...కానీ ఇప్పుడు కుముద పాడుతున్న తీరూ...ఆ లయ, స్వరాల పరిజ్ఞానం చూస్తుంటే నాకూ నేర్చుకోవాలనిపిస్తుంది ''

గోదారమ్మ వెంటనే సంతోషంగా ''మంచి మాట చెప్పావు సీతా...సంగీతం నేర్చుకోవటానికి వయసుతో పనేముంది ! నేనిక్కడకు వచ్చిన రోజు చేతుల్లో సంచీలను అలాగే పట్టుకుని... నీ ఇంటిముందు... నీ పాట వింటూనే కదూ మైమరచి నిలబడ్డానూ... అప్పుడు అనుకున్నానని చెప్పానుగా, నీ పాటలు వింటూ చక్కగా కాలక్షేపం చేయొచ్చని ఈ చుట్టుపక్కలే ఏదైనా చిన్న పోర్షను అద్దెకు దొరుకుతుందేమోనని నిన్నడిగితే ... నీ ఇంట్లోనే చోటిచ్చి ఆదరించావు...!''

సీతకు కళ్ళు చెమరించాయి!

"నేను చోటిచ్చి ఆదరించటం ఏమిటమ్మా...! ఒంటరిగా... పిల్లాడితో బ్రతుకీడుస్తున్న నాకు... పెద్ద తోడుగా నిలిచి... నా ఇంట్లో సర్దుకుని ఉండటానికి మీరు అంగీకరించటమే... నాకు గొప్ప మేలు జరిగినట్లు...!''

సీత మాటలకు ఆవిడ చిరునవ్వుతో చూస్తూ అంది ''నిజమే... నీకు చిన్నతోడు, పెద్దతోడు ఉన్నాయి. కానీ... సమ వయస్కుల తోడు ఒకటీ కూడా జతపడాలనేది నా ఆశ''

సీత నిట్టూర్చింది. ''అది జరిగేది కాదని మీకు చెప్పాను కదమ్మా...'' అంది. గోదారమ్మ కూడా ఇక రెట్టించకుండా .. అలా కాసేపు తాను గుడికి వెళ్ళొస్తాననే విషయం సీతకి చెప్పింది. ''మీరు తరచూ గుడికి వెళ్తూండటంతో నాకీ అనుమానం వచ్చి అడుగుతున్నాను. మీరెప్పుడూ పూజలవీ చేయటం చూడలేదుగానీ, ఈ గుడికి వెళ్తూ ఉంటారంటే... మీకు దేముడంటే బాగా భక్తి ఎక్కువా అమ్మా...?'' సీత ప్రశ్నకి గోదావరమ్మ చిన్నగా నవ్వింది.